**ఈ వారం కథ**

# అంతర్యాలు

అల్లూరి గౌరిలక్ష్మి

"అక్కను చూసి చాలా రోజులయ్యింది. చూసి వెళ్దామండీ!" అడిగింది వర్ధనమ్మ భర్త రామారావుగారిని. ఆయన ప్రముఖ వాణిజ్యవేత్త. వారి కూతురు డాక్టరు సీటూ, కొడుకు ఇంజనీరు సీటూ కొనుక్కుని చదువుతున్నారు. భర్త పని మీద బొంబే, ఢిల్లీ వెళుతుంటే ఆమె కూడా బయలుదేరింది చూసి వద్దామని. అక్కడ కూతురికి చుడీదార్లు, నైటీలు, కొడుక్కి బట్టలు, తనకి చీరలు, పెద్ద లెదర్‌బాగ్స్, హాండ్ బ్యాగ్స్ చాలా కొన్నది వర్ధనమ్మ డబ్బు ధారాళంగా ఖర్చుపెట్టి. బొంబే ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌లో దిగారు దంపతులు టూర్ నుంచి తిరిగి వెళుతూ.

టాక్సీలో కూర్చుని ఆలోచించిందామె, అక్కకి తను కొన్న వాటిలో ఏమైనా ఇస్తే బావుంటుందని. అన్నీ విలువైనవే. తన కూతురి కోసం కొన్నవీ, తన కోసంకొనుక్కున్నవీ. ఏవీ ఇవ్వ బుద్ధికాలేదు అసలు ఇంత సామానుతో ఇప్పుడు దిగవలసింది కాదేమో! సరే ఏం చేస్తాం? ఏవీ చూపించకుండా వుంటేసరి" అనుకున్నాక మనసు కుదుటపడిందావిడకు.

ఆమె అక్కగారైన నిర్మలమ్మ భర్త ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్. కొడుకు అమెరికాలో డాక్టరుగా స్థిరపడ్డాడు. కూతురు పెళ్ళికి రెడీగా వుంది. ఆ పిల్లకి నాలుగైదు లక్షల కట్నం ఇవ్వడానికి తల్లిదండ్రులు సిద్ధంగా వున్నారు. హైదరాబాద్‌లో రెండిళ్ళు కట్టుకున్నారు.

వర్ధనమ్మగారు టాక్సీ దిగగానే "పిన్నీ" అంటూ కౌగలించుకుంది ఆమె అక్క కూతురు లత. ప్రయాణపు బడలిక అంతా తీరాక తీరు బాటుగా కూర్చుని కష్టం, సుఖం కలబోసుకున్నారు.

"బొంబే, ఢిల్లీల్లో ఏంకొన్నావే వర్ధనీ?" నవ్వుతూ అడిగింది నిర్మలమ్మ చెల్లెల్ని.



"ఏమీ తోచక మీ మరిదిగారి వెంట బయలుదేరానక్కా. ఏమీ కొనలేదు. రూమ్‌లోనే వుండిపోయా" అంది వర్ధనమ్మ, భర్త చూపుని తప్పించుకుంటూ మెల్లగా ఆ టాపిక్‌ను మారుస్తూ

"అక్కా! రఘూ ఎలా వున్నాడే! మొన్ననే వచ్చాడట కదా అమెరికా నుంచి! జీతం బాగా వస్తుందొచ్చు. ఏమన్నా తెచ్చాడా? బంగారం, వస్తువులూ అవీ!" ఆరా తీసింది.

"ఏం సంపాదన లెద్దూ! రావడానికీ, పోవడానికీ బోలెడై పోతుందనుకో వర్ధనీ. పిల్లాడు ఒక్కడూ దూరమైపోయాడు. గబుక్కున చూడాలంటే కుదరదు. ఇది కాస్తా పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే మీ బావా, నేనూ ఒంటరివాళ్ళం అయిపోతామని దిగులుగా వుందే" బాధను వ్యక్తపరిచింది నిర్మలమ్మ.

కొడుకు తెచ్చిన వి.సి.ఆర్., గోల్డ్ చెయిన్స్, వాచీలు, స్టీరియో, చీరలు చూపిస్తే ఏదో ఒకటి ఇవ్వవలసి వస్తుంది దీనికి. ఇవ్వకపోతే బావుండదు. పైగా గోల్డ్ చూసిందంటే ఇంకేం లేదు. డబ్బులిచ్చేస్తా కొన్న రేటుకిమ్మని కూర్చుంటుంది. ఇవన్నీ ముందే ఆలోచించి పెట్టుకుంది నిర్మలమ్మ. అందుకే ఏదీ తొందరపడి చూపించలేదు నిదానంగా వ్యవహరించింది.

ఒక్క రోజుండి తిరుగు ప్రయాణం అయ్యారు వర్ధనమ్మ దంపతులు. బొట్టు పెట్టి చీరలోనే జాకెట్టు వుండే వందరూపాయిల కాటన్ చీర చెల్లెలి చేతిలో పెట్టింది నిర్మలమ్మ. చెల్లెలు వెళ్ళిపోతుంటే కళ్ళనీళ్ళు పెట్టుకుంది ఆవిడ. అక్కగారి కన్నీరు చూసి వర్ధనమ్మ కళ్ళు నీళ్ళతో నిండాయి.

"అమ్మా, నాన్నా అన్యాయం చేసి

పోయారు. ఇక మనిద్దరం ఒకరికొక ళ్ళమే అక్కయ్యా!" అంది గద్గదికంగా.

"లత పెళ్ళిలో కలుసుకుందామండీ" అంటూ తోడల్లుణ్ణి సాగవంపాడు నిర్మలమ్మ భర్త.

"చెల్లీ నువ్వు లత పెళ్ళికి పది రోజులు ముందు వచ్చి అన్నీ చూసు కోవాలే" చెయ్యి పట్టుకుంటూ అంది నిర్మలమ్మ.

" అదేమిటక్కా నువ్వంతగా చెప్పాలా?" అంటూ వీడ్కోలు తీసుకుంది వర్ధనమ్మ.

వాళ్ళని స్టేషన్‌లో దింపి రమ్మని కారులో లతనుకూడా పంపింది నిర్మలమ్మ.

లత ఇంటికి తిరిగి వస్తూనే "అమ్మా! కొద్దిగా మంచి నీళ్ళియ్యి" అంటూ కుర్చీలో కూర్చుని "ట్రైన్ కరెక్ట్ టైమ్‌కి బయలు దేరిందమ్మా" అంది.

నిర్మలమ్మ కూతురికి ఫ్రిజ్‌లోంచి మంచినీళ్ళు తీసి ఇస్తూ "లతా! పిన్ని సినిమా ఇంటర్వెల్‌లో కూడా షాపింగ్ చేసే రకమే! అలాంటిది బొంబాయి, ఢిల్లీ వెళ్ళి ఊరికే తిరిగొస్తుందా? అయినా చిన్నాన్నకి బిజినెస్సులో అడ్డంగా లాభాలొస్తాయి కదే! ఆ డబ్బంతా ఏం చేసుకుంటారు. ఆ సూట్‌కేస్‌ల నిండా ఎన్ని కొని తీసుకు పోతూందో! చూపిస్తే కావాలని అడిగే స్తామా చెప్పు? దీనికి చిన్నప్పటి మంచీ ఇలాంటి బుద్ధులేవే!" అంటున్న తల్లి వంక చిత్రంగా చూసింది లత.

ఇంటికి వస్తూనే వర్ధనమ్మ ముఖం కడుక్కుని కాఫీ తాగి సూట్‌కేస్‌లు విప్పి కూతురికి చూపించింది. వచ్చేటప్పుడు హైదరాబాద్‌లో తన అక్కగారిని చూడడానికి దిగిన విషయం చెబుతూ "ఇదిగో రాణీ పెద్దమ్మ చూశావా ఎలాంటిదో! కొడుకు ఫారెన్ వెళ్ళి బోలెడు సంపాదించి పోస్తున్నాడు కదా! కనీసం వాడేం తెచ్చాడో ఒక మాట కూడా చెప్పలేదు. ఇదిగో ఈ పెట్టుబడి చీర నా మొహాన పారేసింది. నేనిలాంటి చీరలు ఎప్పుడైనా కట్టానా?" అంటూ సూట్‌కేస్‌లోంచి చీరతీసి సోఫాలో విసిరి కొడుతున్న తల్లి వంక విచిత్రంగా చూసింది రాణి.




బలభద్రపాత్రుని

రమణి

కొత్త సీరియల్
త్వరలో


# PMR LAW COLLEGE

Preference No. OU.17

3 Yr, 5 Yr Courses.



PONUGOTI EDUCATIONAL SOCIETY

PMR DEGREE COLLEGE

B.Sc., B.A., B.Com.

PMR JUNIOR COLLEGE

MPC, BPC, MEC, CEC.

SUPERIOR EDUCATION AND TRAINING

PMR INFOWISE COMPUTER CENTRE

Reasonable Fees . Excellent Faculty. Scholarships as per Govt. Rules.

ROAD NO.3, TARNAKA, SEC-BAD-17. PH : 818082

G.I. COMMUNICATIONS